

సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం | 30 మే 2025

పేజీలు 8


## నంద్యాలలో
# హై టెన్షన్.. టెన్షన్

- నడిగడ్డలో క్షణం..క్షణం భయం..భయం
- ఒక వెంచర్ నుంచి వెళ్లే రహదారి మూసివేత
- రాకపోకలు నిషేధిస్తూ నిర్మాణాలు
- ఇప్పటికే ఒక వర్గం పై మరో వర్గం దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న ఇరువర్గాలు
- తాజాగా ఒక వర్గానికి తీవ్ర బెదిరింపులు..పోలీసులకు మరో ఫిర్యాదు..!



రహదారిపై అడ్డంగా మట్టి కుప్ప

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల పాత పట్టణంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పాత పట్టణంలో అభివృద్ధి చెందుతున్న నడిగడ్డలో క్షణం క్షణం భయం భయంగా కనిపిస్తుంది. ప్రధానంగా ఒక వెంచర్ నుంచి వెళ్లే ఒక రహదారిని మూసివేశారు. మరో రహదారిలో రాకపోకలు నిషేధిస్తూ శరవేగంగా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ఇప్పటికే ఒక రహదారి విషయంలో ఒక వర్గంపై మరో వర్గం దాడికి తెగబడింది. మరో వర్గం తమపై దాడి జరిగిందని ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. తాజా ఒక వర్గానికి మరో వ ర్గం నుంచి బెదింపులు తీవ్రతరం కావడంతో పోలీసులకు మరో ఫిర్యాదు అందచేసే ఆలోచనలో ఉన్నారు. ఒకవైపు రహదారి మూసివేతతో అవతలి వైపు ఉన్న ఇళ్లకు రాకపోకలు మరో వైపు ఆ ప్రాంతంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను నిలిచిపోయాయి. రహదారి కోసం ఇళ్ల యజమానులు..ఇంటి నిర్మాణాల యజమానులుప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం రహదారి మూసి వేసిన వెంచర్‌కు వెళ్లేందుకు ప్రధాన రహదారి హక్కులు లేకపోయిన పది ఏకరాలకు పైగా ప్లాట్లు మిగతా 2లో

## చెరువుల మరమ్మత్తులకు
# మోక్షమెన్నడో..!!

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ఒకప్పటి ఊట చెరువులు ఒట్టి చెరువులుగా మారుతున్నాయి. నీటి వనరులు తక్కువగా ఉండే ప్రాంతాల్లో చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం సాగేది. అయితే రాను రాను చెరువుల్లో నీటి నిల్వ తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువుల్లో పూడిక పెరగ డం, తూములు, పంట కాలువలు, మట్టి కట్టలు బలహీనంగా ఉండటంతో ఆశించిన మేర పంట పొలాలకు నీరందడం లేదు. ఆళ్లగడ్డ మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో 26 చెరువులు ఉన్నా యి. చాగలమర్రి మండలంలో డి. వనిపెంట, ముత్యాలపాడు, చింతలచెరువు, తోడెండ్లపల్లెలో చెరువులు ఉన్నాయి. మిగతా 2లో



శిథిలావస్థలో చెరువు డిస్ట్రిబ్యూటరీ

- చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- శిథిలావస్థలో పంట కాలువలు
- ఆయకట్టుకు అందని నీళ్లు..ఆందోళనలో రైతన్నలు



అడవిలా మారిన చెరువు దృశ్యం



నీరు లేక ఎండిపోయిన డి.వనిపెంట చెరువు

## ప్రభుత్వ భూములను
# పరిశీలించిన కలెక్టర్



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

2లో

## ఆధునిక వ్యవసాయం పై
# రైతులు ఆసక్తి చూపాలి

- ఖర్చు తగ్గించుకునే వ్యవసాయం చేపట్టాలి
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

2లో



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్,పాల్గొన్న రైతులు

# చెరువుల మరమ్మత్తులకు మోక్షమెన్నడో..!

(మొదటి పేజి తరువాయి)

చింతల చెరువు కింద 250 ఎకరాలు, ముత్యాలపాడు చెరువు కింద ఖరీఫ్‌లో 550 ఎకరాలు, రబీలో 270 ఎకరాలు, డి.పని పెంట చెరువు కింద ఖరీప్‌లో 900 ఎకరాలు, రబీలో 400 ఎకరాలు,తోడెండ్లపల్లె చెరువు కింద 100 ఎ కరాలు, తిప్పనపల్లె చెరువు కింద 600 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. చెరువులకు మంజూరయ్యే నిధులతో తాత్కాలిక పనులు చేపట్టి అధికారులు, కాంట్రాక్టర్లు చేతులు దులుపు కుంటున్నారు.. తోడెం డ్లపల్లె గ్రామంలోని చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది. చెరువు లో నీరు లేకపోవడంతో బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆయా చెరువుల్లో రబ్బరు చెట్లు, పూడిక పెరిగిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది.

**శిథిలావస్థలో పంట కాలువలు :** మండలంలోని చెరువుల ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే పంట కాలు వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పంట కాలు వల డిస్ట్రిబ్యూటర్లు దెబ్బ తిన్నాయి. ముత్యాలపాడు, డి. వనిపెంట, చింతలచెరువు, తిప్పన పల్లె చెరువుల ద్వారా నీరందించే పంట కాలువలు పూడిపోవడంతో చెరువుల ద్వారా చివరి ఆయకట్టుకు చుక్కనీరందడం లేదు. వర్షాకాలంలో చెరువులకు నీరు నింపుతున్న పంట కాలువలు లేకపోవడంతో ఆయకట్టుకు నీరందడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి చెరువుల మరమ్మతులు, పంట కాలువల పనులు చేపట్టి ఆయకట్టుకు నీరం దేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**పనులు చేపట్టాలి..వీరయ్య,, రైతు, డి.వనిపెంట :** వర్షాకాలంలో చెరువులు నిండుతున్నా ఆయకట్టుకు నీరందదు. చెరువుల్లో నుంచి పంట పొలాలకు అందించే కాల్వలు దెబ్బ తిన్నాయి. ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పంట కాలువ పనులు చేపట్టి నీరందేలా చూడాలి.

**నామమాత్రంగా మరమ్మతులు..బాబునాయుడు, రైతు, డి.వనిపెంట :** చెరువుల్లో మరమ్మతులు చేపట్టక పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. నామమాత్రంగా మ రమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ఈ ఏడాదైన చెరువు మరమ్మతు పనులు చేపట్టి నీరందించేలా చూడాలి.

# నంద్యాలలో హై టెన్షన్..టెన్షన్

(మొదటి పేజి తరువాయి)

వేసి అమ్మకాలు జరిపినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. వెంచర్‌కు వెళ్లేందుకు రహదారిగా చూపించినది ఒక స్థలంగా ఇద్దరి పేరుతో రిజిస్ట్రేషన్ ఉన్నట్లు తెలుస్తోంది. వెంచర్ నుంచి వెళ్లే రహదారి మూసివేత అంశం అధికార పార్టీ నేతల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఆ వెంచర్‌కు అనుకొని ఉన్న 50 సెంట్ల స్థలం వ్యవహారం రహదారి మూసివేతకు కారణంగా చెబుతున్నారు. ఎప్పుడు ప్రశాంతంగా ఉండే నడిగడ్డ ప్రాంతంలో రహదారుల వివాదం తీవ్ర ఉద్రిక్తతలను దారితీస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

నంద్యాల పాత పట్టణంలోని ప్రధానమైన నడిగడ్డలో రహదారుల అంశంగా ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయి. ఒక వెంచర్‌కు వెళ్లే ర హదారి ఒకటి అయితే ఆ వెంచర్ నుంచి వెళ్లే మరో రెండు రహదారులు ఇందుకు కారణం అయ్యాయి. స్థిరాస్తుల వ్యాపారుల మధ్య రహదారులు వివాదస్పందగా మారాయి. వ్యాపారుల మధ్య తలెత్తిన రహదారుల వివాదం సమీపంలోని ఇళ్ల యజమానులు, ఇళ్ల నిర్మాణాల యజమానులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. గడిచిన ఐదు రోజులుగా ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. మరో రహదారి నుంచి నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు రహదారి సమస్య తలెత్తే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. నడిగడ్డ ప్రాంతంలో కొందరు స్థిరాస్తి వ్యాపారులు సుమారు పది ఎకరాల్లో వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఆ వెంచర్‌లోని ప్లాట్లకు వెళ్లేందుకు చూపించిన రహదారి ఇద్దరి పేరిట స్థలంగా రిజిస్ట్రేషన్ అయింది. వెంచర్‌కు ప్రధానంగా రహదారి లేకపోవడం ఒకటైతే ఆ వెంచర్‌లో ఏర్పాటైన ఒక రహదారుల్లో ఒక చోట పూర్తిగా రోడ్డుకు అడ్డంగా మట్టిని వదలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ వెంచర్‌లోని మరో రహదారిపై ఇతరులు ఎవరూ రాకపోకలు సాగించకుండా పిల్లర్లను నిర్మించారు. ఆ పిల్లర్లకు గేటును ఏర్పాటు చేసేందుకు సర్వం సిద్ధమైంది. వెంచర్‌లోని రహదారిని అనుకొని ఉన్న 50 సెంట్ల స్థలాన్ని స్థిరాస్తి వ్యాపారులు కొందరు బృందంగా ఏర్పడి కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని మరో స్థిరాస్తి వ్యాపారుల బృందం దక్కించుకోవాలని చూసినట్లు తెలుస్తోంది. అప్పటికే



మరో రహదారిపై పూర్తైన పిల్లర్ల నిర్మాణం

మొదటి బృందం కొనుగోలు చేసి యజమానులకు కొంత నగదును చెల్లించినట్లు తెలుస్తోంది. ఆ స్థలానికి రహదారి లేకుండా చేయడంలో భాగంగానే రహదారిపై మట్టి కుప్పను వదిలినట్లు తెలుస్తోంది. ఐదు రోజుల క్రితం రహదారుల అంశాలపై మాట్లాడుకునేందుకు ఒక చోట ఇరువర్గాలు సమావేశం అయ్యాయి. ఆ సమయంలో ఒక వర్గంపై మరో వర్గం దాడి చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు ఒకరు నంద్యాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు మరో వర్గం తమపై దాడి జరిగినట్లు అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఇరువర్గాల ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం అధికార టీడీపీ మహానాడు జరుగుతుండటంతో కొందరు పోలీసులు ఆ విధుల్లో ఉన్నారు. మహానాడు గురువారం ముగిసింది. ఇదే సమయంలో వెంచర్‌లోని మరో రహదారిలో సమీప ప్రాంత ఇళ్ళ యజమానులకు రాకపోకలను నిషేదించే దిశగా రహదారిపై శాశ్వత నిర్మాణాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఒక వర్గానికి మరో వర్గం నుంచి బెదిరింపులు తీవ్రతరం అయినట్లు తెలుస్తోంది. బెదిరింపులకు గురైనట్లుగా బావిస్తున్న కొందరు తాజాగా అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద నడిగడ్డ రహదారుల అంశం చిలికి చిలికి గాలి వానగా మారుతూ ఏలాంటి మలుపులు తిరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## కాలనీలో విద్యుత్ సౌకర్యం

# ఏర్పాటు చేసేవరకు పోరాటం ఆగదు

**ఆదోని,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీసాయినగర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యులు వీరేష్, మండల కార్యదర్శి బసాపురం గోపాల్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అంజిత్ గౌడ్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీలో 50మంది నిరుపేద కుటుంబాలు కొన్ని నెలలుగా పూరిగుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి సరైన విద్యుత్ సౌకర్యం లేనందున ప్రజలు భిక్కుభిక్కుమంటున్నారు. కాలనీలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరించలేని పక్షంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహి స్తామని హెచ్చరించారు. సీపీఐ పట్టణ,సహాయ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, విజయ్, రాముడు,రమేష్ కుమార్, సీపీఐ నాయకులు నరసింహులు, కిరణ్, జయమ్మ, మహాలక్ష్మీ, పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూములు పరిశీలించిన కలెక్టర్



స్వామి వారిని దర్శించుకుని హారతి తీసుకుంటున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతనిధి :** నగర శివారులోని జగన్నాథ గట్టుపై ఉన్న ప్రభుత్వ భూములను గురువారం జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగన్నాథ గట్టు వద్ద టిడ్కో గృహాలకు, క్లస్టర్ యూనివర్సిటీకి, ఐఐటిడిఎంయకు ఇతర సంస్థల కోసం కేటాయించిన భూములను పరిశీలించినట్లు తెలిపారు. మ్యాపుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సంస్థల ఏర్పాటుకు కేటాయించిన భూములకు సంబంధించి సమగ్రమైన వివరాలతో నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆర్డీ, తహశీల్దార్లను ఆదేశించారు. సిల్వర్‌జూబ్లీ క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించి నిర్మాణ పనులకు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఈఈ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా మరొకసారి డిఓ లెటర్ సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సిల్వర్ జూబ్లీ క్లస్టర్ ఈఈను ఆదేశించారు. అనంతరం గట్టుపైన ఉన్న రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం, దర్గాలను కలెక్టర్ దర్శించుకున్నారు. ఇలాంటి టూరిస్ట్ ప్రదేశాలను ప్రజలకు తెలియజేసే విధంగా పెద్ద ఎత్తున పబ్లిసిటీ చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, కర్నూలు మండల తహశీల్దార్ రమేష్, క్లస్టర్ యూనివర్సిటీ ఈఈ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలి

**మహానంది, మేజర్‌న్యూస్ :** శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి మంచి విత్తనాలను అందుబాటులోకి తీసుకొని వస్తారని, ఆధునిక వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతూ శాస్త్రీయ సలహాలు పాటిస్తూ లాభసాటి వ్యవసాయం చేపట్టాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. గురువారం బుక్కాపురం గ్రామంలో బనగానపల్లె మండలంలోని యాగంటి పల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆద్వర్యంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా నిర్వహించిన ఉద్యానవన పంటల మెలకువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు పరిశోధనా మండలి శాస్త్రవేత్త డాక్టర్ సుగన్న, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ధనలక్ష్మి, రమణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం, పంటల్లో వేయవలసిన ఎరువుల మోతాదుపై రైతులకు వివరించారు. మొక్కజొన్న, కంది, వరి, సోయాబీన్ పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్ళ నివారణ కొరకు పురుగుల మందుల యాజమాన్య పద్దతులపై రైతులకు క్షుణ్ణంగా వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని, లాభసాటి వ్యవసాయం చేయాలని పేర్కొన్నారు. రైతు సమస్యలు నాకు తెలుసునని, నేను రైతు బిడ్డనేని పేర్కొన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు ఉద్యానవన పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు మేలైన రకాలను ఎంపిక చేసుకోవాలని, వాటి వివరాలను తెలిపారు. చేపట్టాల్సిన యాజమాన్య పద్దతులను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన అధికారి నాగరాజు, ఆత్మ పీడీ రత్నకుమార్, నంద్యాల ఏడీఏ రాజశేఖర్, మండల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు టిడిపి శ్రేణులు

**దొర్నిపాడు ,మేజర్ న్యూస్ :** కడపలో మూడవ రోజు జరుగుతున్న మహానాడుకు దొర్నిపాడు మండలంలోని క్రిష్టిపాడుగ్రామ టిడిపినాయకులు కట్టుబడి బాషా, కట్టుబడి రహీమ్ బాషా, పెట్నీకోట బాషాల ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు టిడిపి నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి నాయకులు భార్గవరామ్ నాయుడు, టిడిపి యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని అన్ని మండలాల నుంచి భారీ సంఖ్య లో వాహనా ల్లో వెళ్లారు ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు కట్టుబడి బాషా, కట్టుబడి రహీమ్ బాషా పెట్నీకోట బాషా పల్లె జగదీష్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి శివరామిరెడ్డి కార్యకర్తలు శ్రీకాం త్, శివ,రఫీ,వెంకటపుల్లయ్య, ఏసుపాదం నరసింహుడుసురేష్,పెద్ద గురన్నలు పాల్గొన్నారు




మహానాడుకు బయలుదేరిన టిడిపి శ్రేణులు

# గుంతలుగా మారిన ఆర్అండ్బి రోడ్లు

- ప్రయాణీకులకు తప్పని తిప్పలు
- మరమ్మత్తులు తూతూ మంత్రంగా...
- పట్టించుకోని ఆర్అండ్బి అధికారులు



గుంతలు పడిన తారు రోడ్డు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** హైవే ప్రధాన రోడ్లు గ్రామాల్లో రోత పుట్టిస్తున్నాయి. గుంతలు పడి అధ్వానంగా మారాయి. మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం నుంచి ఆదోని వెళ్లే రోడ్డులో మాలపల్లి రచ్చుమర్రి గ్రామాల్లో తారు రోడ్లపై కంకర లేచి గుంతలు పడడంతో వాహనాలు నడపడానికి ప్రజలు కాలినడక నడవడానికి, తిరగడానికి నానా అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే కుంటలుగా మారుతున్నాయి. ప్రజల రాకపోకలు కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుకు గుంతలు పడిన చోటా ప్యాచ్ వర్కులు, మరమ్మత్తుల కోసం నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు మాత్రం తూతూ మంత్రంగా పనులు చేసి వదిలేశారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం పర్యవేక్షణ చేయకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అధికారులపై మండి పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పుట్టగొడుగుల పెంపకం పై మహిళలకు శిక్షణ



వ్యవసాయ కళాశాలలో కిట్లను అందజేస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్న్యూస్ :** మహానంది వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకంపై ఎస్సీ మహిళలకు ఒక్క రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. గురువారం పాణ్యం మండలం బలపనూరు గ్రామానికి చెందిన మహిళలకు ఈ శిక్షణా తరగతులను నిర్వహించి పోషకాహార విలువలపై వివరించారు. ఈ శిక్షణలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి, ఓఎస్ఏ డాక్టర్ ఎల్ విజయభాస్కర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఫరిదాలు పాల్గొని పుట్టగొడగుల పెంపకంపై విధి విధానాలను క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్గా వివరించారు. టీచింగ్ అసోసియేట్ డాక్టర్ గుర్విరెడ్డి, సుబ్బరామిరెడ్డిలు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం మహిళలకు న్యూట్రీషియనల్ కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బలపనూరు వీఏఏ రేష్మ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**– నగరపాలక మేనేజర్ యన్ చిన్నరాముడు**



**కర్నూలు నగరం, మేజర్న్యూస్ :** యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నగరపాలక మేనేజర్ యన్ చిన్నరాముడు అన్నారు. గురువారం ఖానా–ఖజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ప్రతిఒక్కరు యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, కోచ్లు అక్షర, మునిస్వామి, జిల్లా యోగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్లు పాల్గొన్నారు.

## మహానాడుకు బయలుదేరిన టిడిపి నాయకులు

**డోన్రూరల్, మేజర్న్యూస్:** కడప మహానాడు–2025 మూడవ రోజు భారీ బహిరంగ సభకు డోన్ పట్టణంలో నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువనేత ధర్మవరం మన్నె గౌతమ్కుమార్రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ ఎదురుగా ఉన్న ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కడప మహానాడు భారీ బహిరంగ సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, రాష్ట్ర ఎస్సిసెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, జిల్లా ఎస్సిసెల్ కమిటీ నాయకులు రాముడు, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, డోన్ పట్టణ టిడిపి బీసిసెల్ అధ్యక్షులు చక్రపాణిగౌడ్, డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సిటీకేబుల్ కిరణ్, ఉంగరానిగుండ్ల మద్దయ్య, శేఖర్గౌడ్, సీసంగుంతల బబ్లూయాదవ్, పార్థసారధిరెడ్డి(పార్థు), కొచ్చెర్వు మహేశ్వరరెడ్డి, హుమయిన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీమ సాగునీటి హక్కుల సాధనే లక్ష్యంగా

# ప్రజా బహిరంగ సభ

**– మే 31న ఛలో సిద్దేశ్వరం**



బొజ్జా దశరథరామిరెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్న్యూస్ :** శ్రీశైలం రిజర్వాయర్ వద్ద పెద్ద గోతి పడినా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుని పోయినా, అలగనూరు రిజర్వాయర్ తెగిపోయినా, గోరుకల్లు రిజర్వాయర్ కట్టలు కుంగిపోయినా తుంగభద్ర ప్రాజెక్టుల గేట్లకు భద్రత లేకున్నా వాటి పటిష్ట భద్రతకై నేటి వరకు పాలకులలో ఏ మాత్రం చలనం లేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమలోని అనేక ప్రాజెక్టుల ప్రధాన కాలువలు, ఉపకాలువలు, పంట కాలువల, డిస్ట్రిబ్యూటరీల రూపురేఖలే లేకుండా చిద్రమైపోయినాయని ప్రపంచ వారసత్వం సాగునీటి ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన కేసీ కెనాల్ ఆయకట్టుకు నీరు ఎంతవరకు ఇస్తారో భరోసా ఇచ్చే పరిస్థితులు లేకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8దశాబ్దాల కిందట నిర్మాణం అయిన తుంగభద్ర ఎగువ కాలువ, తుంగభద్ర దిగువ కాలువల కింద హక్కుగా ఉన్న 4,36,000 ఎకరాల ఆయకట్టు భూమిలో కేవలం 1,30,000 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నేటికీ నీరు లభిస్తుండడం రాయలసీమ పట్ల పాలకుల వివక్షతకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. నాలుగు దశాబ్దాల కింద నిర్మాణం మొదలైన తెలుగుగంగ, గాలేరునగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇంకా మూడు ద శాబ్దాలైన పూర్తయ్యే పరిస్థితులు లేకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలోని అనేక చెరువుల తూములు, అలుగులు, కట్టల అధోగతి పాలైనా వాటి మరమ్మతులకు నిధుల మంజూరు ప్రయత్నం ముందుకు రావడం లేదన్నారు. హామీలు ఇచ్చిన సిద్దేశ్వరం అలుగు, సీడ్హబ్, హార్టికల్చర్ హబ్ తదితర అంశాలపై పాలకులు కేవలం ప్రకటనలకే పరిమితమైనారే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుపై ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. రాయలసీమ ప్రగతి చేపట్టేలాగా పాలకులపై ఒత్తిడి తెద్దాం ప్రతి గడప నుంచి సిద్దేశ్వరానికి కదులుదాం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధన ఉద్యమంలో భాగస్వాములవుతదాం మే 31న సంగమేశ్వరంలో జరిగే ప్రజా బహిరంగ సభకు తరలివెళదాం అని ప్రజలకు పిలుపునిచ్చారు.

## బుడగ జంగాల హాస్టల్కు ప్రభుత్వ స్థలం కేటాయించాలి



ఆర్డీవో రామ్నాయక్ వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నంద్యాల నూనెపల్లె, మేజర్న్యూస్ :** బుడగ జంగాల హాస్టల్కు ప్రభుత్వం స్థలం కేటాయించాలని బేడ బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ అన్నారు. గురువారం నంద్యాల నందమూరినగర్లోని బేడ బుడగ జంగాల అర్బన్ రెసిడెన్షియల్ హాస్టల్ను ఆయన తనిఖీ చేశారు. అక్కడి వసతులు, సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడగ జంగాల హాస్టల్కు ప్రభుత్వ స్థలంలో బిల్డింగ్ కేటాయించాలని అన్నారు. బేడ బుడగ జంగాల పిల్లలు భిక్షాటన వైపు పోకుండా, చదివి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని అన్నారు. ప్రస్తుతం హాస్టల్ నందు 140 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందని, ఒకటవ తరగతి నుంచి పదోవ తరగతి వరకు సౌకర్యం కలిగి ఉన్న వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం బుడగ జంగాల హాస్టల్కు ప్రభుత్వ స్థలంలో బిల్డింగ్ కేటాయించాలని ఆర్డీవో రామ్నాయక్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ ప్రేమంత్ కుమార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ కార్యదర్శి సుబ్బరాయుడు, రాజేశ్వరమ్మ, జమ్మన్న, నంద్యాల అధ్యక్షులు సుధాకర్, గిరిధర్, శిరసాల సుంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు




పాలకొలను గ్రామం నుంచి తరలివెళ్తున్న నాయకులు

**ఓర్వకల్లు, మేజర్న్యూస్ :** కడపలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడురోజుల పాటు జరుగుతున్న టిడిపి మహానాడుకు ఓర్వకల్లు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. నన్నూరు గ్రామ టిడిపి నాయకుడు విశ్వేశ్వర్రెడ్డి గ్రామ టిడిపి నాయకులతో కలిసి మూడు బస్సులలో బయలుదేరి వెళ్లారు. పాలకొలను గ్రామం నుండి టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి ఆద్వర్యంలో బస్సులో బయలుదేరి వెళ్లారు. ఉయ్యాలవాడ గ్రామం నుండి టిడిపి నాయకులు రమణారెడ్డి ఆద్వర్యంలో తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి వాహనాల్లో తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు.

## సీఎంకు టీడీపీ ఇంఛార్జ్ సన్మానం

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహానాడు సభలో సీఎంను మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ శాలువతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సీఎంను కోరారు.

## జై భీమ్ ఎమ్మార్పిఎస్ మండల ప్రతినిధి జోసఫ్కు నివాళి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మండల జై భీమ్ ఎమ్మార్పిఎస్ ప్రతినిధి జోసెఫ్ బుధవారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొన్న జై భీమ్ ఎమ్మార్పిఎస్ రాష్ట్ర నాయకులు జానయ్య, మాదిగ గర్జన హనుమన్న రత్నం, నరసింహులు, తదితరులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జోసెఫ్ మృతి ఎమ్మార్పిఎస్కు తీరనిలోటన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మట్టి ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఇందులో నాయకులు నరసింహులు, ఇబ్రాయిల్, ప్రభాకర్, హుసేని, బొజ్జప్ప,దేవదాసు, నాగేష్లు ఉన్నారు.



జోసెఫ్ మృత దేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్య



# స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఎమ్మిగనూరు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** చేనేత పురిగా పేరు గాంచిన ఎమ్మిగనూరు మున్సి పాలిటీ పట్టణ అభివృద్ధికి దోహదపడే మరో రాయి చేరింది. ఎమ్మి గనూరు గ్రేడ్-1 గా ఉన్న మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్ మున్సి పాలిటీగా మా రుస్తున్నట్లు ప్రభుత్వం జీవో, గెజిట్ విడుదల చేసిందని మున్సిపల్ కమిష నర్ గంగిరెడ్డి బుధవారం తెలిపారు. మున్సిపాలిటీ స్థాయి పెరగడంతో రాను న్న రోజుల్లో పట్టణ రూపురేఖలు మారుతాయని తెలిపారు. స్మార్ట్ సిటీ, మరి యు అమృత్ సిటీ గా మారే అవకాశమన్నారు. స్పెషల్ గ్రేడ్ పట్ల ఎమ్మిగనూ రు మున్సిపల్ ఉద్యోగు లు కేక్ కట్ చేశారు. పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పలు ప్రయోజనాలు :** ఈ హోదాతో బహుళ ప్రయోజనాలు చేకూరులున్నాయి. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా పెరిగిన హోదాతో అనేక లాభాలు కలగనున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నుంచి అందే గ్రాంట్లు భారీగా పెరుగుతాయి. ఉద్యోగుల సంఖ్య దాదాపు రెట్టింపు



ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం దృశ్యం

కానుంది.దాదాపు 40 లక్షల వరకు మంజూరు అధికారం మున్సిపాలిటి పరిధిలోనే ఉండటం ద్వారా అభివృద్ధి పనులు జాప్యం లేకుండా నిర్వహి ంచుకొనే వెసులుబాటు ఉంటుంది.

# బంగారుదుకాణంలో మహిళ చోరీ

**- 2 తులాల 8 గ్రాముల బంగారు నెక్లెస్ అపహరణ**


మహిళా చైన్ దొంగలిస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని షరాఫ్ బజార్‌లో బంగారు దుకాణంలో ఓ గుర్తు తెలియని నగలు కొనేందుకు వచ్చి చోరీకి పాల్పడ్డ సంఘ టన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే షరాఫ్ బజార్‌లో 28వ నంబర్ షాపులో మూడ్రోజుల క్రితం బంగారు కొనేందుకు వచ్చిం ది. షాపులో ఉన్న యజమాని ప్రదీప్, సిబ్బంది మహిళకు వివిధ రకాల బంగారు చైన్లను చూపించారు. అయితే సినీ పక్కీ మాదిరిగా దుకాణ యజమాని, సిబ్బందికి ఇంకా కొత్త రకం డిజైన్లు చూపించాలని మాటల్లో పెట్టి దొంగతనానికి పాల్పడి 2తులాల8గ్రాముల బంగారును దొంగలించింది. యజమాని ప్రదీప్ ఒక చైన్ కనపడకపోవడంతో సిసి ఫుటేజ్‌ను చూడగా మహిళ దొంగతనానికి పాల్పడిందని గుర్తించి టుటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు షాపు వద్దకు వచ్చి విచారణ జరిపి షాపులో ఉన్న సిసి ఫుటేజ్ ఆధారంగా మహిళ దొంగతనానికి పాల్పడిందని గుర్తించి ఆ మహి ళను పట్టుకుని సొమ్ము రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# కాజీపేటలో రెండు ఇళ్లలో దొంగలు బీభత్సం


క్లూస్ టీం తో పరిశీలిస్తున్న దృశ్యం

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల పరిధిలోని కాజీపేట గ్రామంలో దొంగలు బీబ త్సం సృష్టించారు. బుధవారం కాజీపేటలో నాగ లక్ష్మి, కైపా సర్వోత్తమ్ రెడ్డి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు ఇన్చార్జి ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు నాగ లక్ష్మమ్మ ఇంట్లో 40 వేల రూపాయల నగదు 4.5 తులాల బంగారం మొత్తం విలువ 1,52,000 చోరీ జరిగినట్లు ఇంచార్జిఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.దొంగలు ఇండ్ల తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు సమా చారం. విషయం తెలుసు కున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును, క్లూస్ టీం తో పరిశీలిస్తున్నారు. ఇదిలా , ఉండగాచుట్టూ సీసీ కెమెరాలులేనిచోట దొంగలు పడటం ప్రజలను కలవర పెడుతుంది. ఇప్పుడు ఈ అంశం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది ఏఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రేణు ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా శంకర్‌నాయక్

**నంద్యాల, మేజర్ న్యూస్ బ్యూరో :** నంద్యాల జిల్లా ఇంట ర్మీడియట్ విద్యాధికా రిగా శంకర్ నాయక్ బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ మహిళా జూనియన్ కళాశాల ప్రాంగణంలోని డీఐ


డీఐఈవో శంకర్ నాయక్

ఈవో కార్యాలయంలో ఆయన ప్రస్తుత డీఐఈవో సునీత నుంచి బాధ్యతలను స్వీకరించారు. గత రెండేళ్ళుగా ఆమె డీఐఈవోగా విధులు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నతా.దికారులు ఆమె స్థానంలో శంకర్ నాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె నుంచి బాధ్యతలను తీసుకున్నారు. శంకర్ నాయక్‌ను పలువురు అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సునీత గోస్పాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తూ డీఐఈవో అదనపు బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం శంకర్ నాయక్ విడూ్తరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తు న్నారు. ఆయనకు డీఐఈవోగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

# మహానాడులో చంద్ర బాబుతో ఆలూరు టీడీపి నాయకులు..


మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ,


మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు,అచ్చెన్నతో వైకుంఠం జ్యోతి


ముఖ్యమంత్రి చంద్రబాబుతో టీడీపి ఇంచార్జ్ వీరభద్రగౌడ్

**ఆలూరు, మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రమైన కడప లో జరిగిన మహానాడులో చివరి రోజు ముగింపు సభలో కర్నూలు జిల్లాకు చెందిన టీడీపీ నాయకు లు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ,మహిళా నా యకురాలు వైకుంఠం జ్యోతి,ఆలూరు టీడీపి ఇం చార్జ్ వీరభద్ర గౌడ్ లు కలిసి ఆలూరు సమ స్యలను బాబుకు విన్నవించారు. జిల్లాల్లో ఒక్క మహిళకు కూడా అసెంబ్లీ లో పాల్గొనే అవకాశం కల్పించలేదని తెలుగుదేశం పార్టీ మహిళల పక్ష పాత పార్టీ కావున జిల్లాలో మహిళలకు ఇంచార్జ్ గా అవకాశం కల్పించాలని వారు కోరారు.అలాగే టీడీపీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ ఆలూరు అభివృద్ధి కి నిధులు కేటాయించి 2029లో టీడీపి ఆలూరులో విజయం సాధించే అవకాశం కల్పించాలని కోరారు.

# ప్రాణం తీసిన ట్రాక్టర్ రూటర్ - యువరైతు మృతి

**కోసిగి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన యువరైతు మదిరి అంజినయ్య అలియాస్ ముక్కరయ్య అనే రైతు ట్రాక్టర్ రూటర్‌లోపడి చనిపోవడం జరిగింది. మదిరి అంజినయ్య తన చిన్నాన్న పొలం పనులకొరకు రూటర్ తీసుకెళ్ళడం జరిగింది. డ్రైవర్ పొలంను రూటర్‌తో దున్నుతుండగా డ్రైవర్‌కు తెలియకుండా అంజినయ్య రూటర్‌పై ఎక్కి నిలవడం జరిగింది. అయితే డ్రైవర్ రూటర్‌ను



తోలుతుండగా అప్పటికే అదుపుతప్పి అంజినయ్య రూటర్‌లోకి కాలు ఇరుక్కోవడం జరిగింది. అంజినయ ఎడమకాలు పూర్తిగా కట్‌చేసుకుంటూ మర్మాంగాలవరకు వెళ్ళడంతో అరుపులు, కేకలు రైతు వేయడంతో డ్రైవర్ మేల్కొనేలోపు పూర్తిగా గాయాలకు గురయ్యారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే చనిపోవడం జరిగింది. ఈ రైతు అంజినయ్యకు భార్య నర్సమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# మహానాడుకు భారీగా తెలుగు తమ్ముళ్లు

**- రహదారి వెంట అల్పాహారం, భోజన సదుపాయాలు**
**- పర్యవేక్షించిన మంత్రులు ఫరూక్, జనార్ధన్‌రెడ్డి**


అల్పాహారం చేస్తున్న మంత్రి ఫరూక్


అల్పాహారాన్ని వడ్డిస్తున్న ఫిరోజ్ చిత్రంలో మిద్దె హుసేన్

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** కడప గడపపై అధికార టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు చివరి రోజు జిల్లా నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. నంద్యాల జిల్లాలోని నియోజకవర్గాల నుంచి కడపకు వెళ్లే రహదారుల వెంట టీడీపీ కార్యకర్తల కోసం అల్పాహారాన్ని, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డిలు వసతులను పర్యవేక్షించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఫరూక్ తనయుడు ఫిరోజ్ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజన సదుపాయాలను టీడీపీ నేతలు మిద్దె హుసేన్, మరికొందరు ఏర్పాటు చేశారు. మహానాడుకు వెళ్లే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడకుండా మహానాడు ప్రాంగణాన్ని గుర్తించేలా ఏర్పాట్లు చేశారు. మంత్రి ఫరూక్ మార్కెట్ యార్డులో అల్పాహారాన్ని ఆరగించారు. మరో టీడీపీ నేత తాతిరెడ్డి తులసిరెడ్డి కార్యకర్తలకు అల్పాహారాన్ని వడ్డించారు. నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు కడప శివారు వద్ద అల్పాహారం, భోజన ఏర్పాట్లను బీసీ జనార్ధన్‌రెడ్డి ఫిరోజ్‌తో కలిసి పర్యవేక్షించారు. మహానాడుకు తెలుగు తమ్ముళ్ళు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి భారీగా తరలి వెళ్ళడంతో కడపకు వెళ్లే రహదా రుల్లోని సమీప ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం తలెత్తిట్లు తెలుస్తోంది. ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, జయసూర్య, కోట్ల జయప్రకాశ్‌రెడ్డి, గౌరు చరిత తమ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తల కోసం గురువారం రాత్రి ఆయా రహదారుల్లో భోజన ఏర్పాట్లును చేశారు.

# స్కానింగ్ సెంటర్ల పై తనిఖీలు నిర్వహించాలి

## – జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతికళ




మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతికళ

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రైవేటు ఆసుపత్రుల్లో స్కానింగ్ సెంటర్లపై సాధారణ, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతికళ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతికళ అధ్యక్షతన అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కొరకు వచ్చిన అప్లికేషన్స్ కమిటీ ఆమోదం కొరకు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వీటిని జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు పరిశీలించారని తదుపరి కలెక్టర్ ఆద్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపడం జరుగుతుందని తెలిపారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, సరైన వివాహ వయస్సుపై అవగాహన కొరకు ఎన్‌జిఓస్ సహాయంతో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల నందు, డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే స్కానింగ్ సెంటర్స్‌పై సాధారణ తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో పిసి,పిఎన్‌డిటి యాక్ట్ జిల్లా నోడల్ అధికారి నాగ ప్రసాద్‌బాబు, పిడియాట్రిక్స్ ప్రొఫెసర్ డా. విజయా నందబాబు, గైనకాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శ్రీలక్ష్మి, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాదర్ బాష, డిఈఎంఓ శ్రీనివాసులుశెట్టి, ఎన్‌జిఓస్ ప్రతినిధులు కొమ్ము పాలెం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చౌక దుఖాణాల ద్వారా ప్రజలకు అందించే నిత్యావసర సరుకులను ఎలాంటి అవాంతరాలు కలుగకుండా సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ రత్నరాధిక డీలర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డీలర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి నిత్యావసర సరుకుల పంపిణీపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జూన్ 1వ తేది నుంచి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా డీలర్లు రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. 1వ తేది నుంచి 15వ తేది వరకు నిరంతరాయంగా ఎలాంటి అంతరాయం కలుగకుండా సరుకులను పూర్తి స్థాయిలో కార్డు దారులకు అందించాలన్నారు. ఈ విషయాన్ని డీలర్లు ఆయా గ్రామాల్లో దండోర ద్వారా ప్రజలకు తెలియజేయాలని , సరుకుల పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రత్నరాధిక

# వక్ఫ్ సవరణ చట్టం చేయడంలో టీడీపీ, జేడీయు పార్టీలు బీజేపీకి సహకరించాయి – ఎస్‌డీపీఐ




మాట్లాడుతున్న ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ గని

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** వక్ఫ్ సవరణ చట్టం చేయడంలో టీడీపీ, జేడీయు పార్టీలు బీజేపీకి పూర్తిగా సహకరించి ముస్లింలకు తీరని అన్యాయం చేశాయని ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ గని అన్నారు. గురువారం నంద్యాల ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో వక్ఫ్ సంబంధిత విషయాలపై ఓల్డ్ టౌన్ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గని ముఖ్య అతిథిగా హాజరై వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, వినియోగంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ప్రాముఖ్యత, వాటి సరైన నిర్వహణ అవసరం గురించి వివరించారు. వక్ఫ్ సవరణ చట్టం వల్ల జరిగే దుష్ప్రయోజనాలను నాయకులకు, కార్యకర్తలకు తెలియజేయాలని అన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ ముస్లింపై చేయబోయే అరాచకాలను ఆయన వివరించారు. అనంతరం పార్టీ అభివృద్ధి, సభ్యత్వ కార్యక్రమాలు, స్థానికుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీపీఐ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మజీద్‌ఖాన్, కమిటీ సభ్యులు నూరుల్లా, అబూబక్కర్, జబెర్, ఎస్‌డీపీఐ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# ప్రతిభా పురస్కారాలకు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో 550 మరియు ఆపై మార్కులు సాధించిన దూదేకుల కులానికి చెందిన నంద్యాల అసెంబ్లీ పరిధిలోని విద్యార్థిని విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు పేర్లు నమోదు చేసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షులు వాసవి దస్తగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15లోపు మార్క్స్ మెమో, ఆధార్ కార్డు ఫోటోలను 9849404646, 9866617758 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని తెలిపారు. నగదు పురస్కారంతో పాటు సన్మానం, ప్రతిభ సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని తెలిపారు.

# కలశ దాతలకు మహా సంకల్పం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయం 50వ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం కలశ దాతలకు మహా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. శాంతి పాఠం, గురువందనం, మండప పూజలు, సహస్రఘట స్థాపనము, వారు నామవాక ఆది మంత్రనం, రుద్రహోమంలు, చండీహోమం, సుదర్శన హోమం, మూలమంత్ర హవనములు, ధాన్యాదివాసం, అనేక మంది భక్తులకు మహాసంకల్పం చేయించడం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

# మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.62.17 లక్షలు



మహానంది క్షేత్రంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన మహానందిలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈవో నల్లకాల్వ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 61 రోజుల పాటు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం ఆలయంలో అభిషేక మండపంలో లెక్కింపు నిర్వహించారు. ఆలయంలోని హుండీల ద్వారా రూ.61,59,832 రాగా, అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ.26,683, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.31,330 కలిపి మొత్తంగా రూ.62,17,845 లభించిందని అన్నారు. అలాగే విదేశీ కరెన్సీ డాలర్లు 12 వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, నీలకంటేశ్వరరాజు, గ్రూపు దేవాలయ ఈవో జనార్ధన్, దేవాలయాల సిబ్బంది, బాలాజీ సేవా ట్రస్టు, తిరుమల బాలాజీ సేవా సమితి, బ్రమరాంభిక, శ్రీరామ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లకు ఈపాస్ మిషన్లు అప్పగింత




తహశీల్దార్ కార్యాలయం ముందు కాటా చెక్ చేస్తున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఎండియు వాహనాల ఆపరేటర్ల దగ్గర ఉన్న ఈపాస్, తూకం మిషన్లను డీలర్లకు అప్పగించేందుకు అందులో ఉన్న సమస్యలను తూకాలపై డిఎస్‌ఓ కార్యాలయం నుండి డిస్టిక్ కోఆర్డినేటర్ నాగరాజు, లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ అసిస్టెంట్ శశాంత్‌లు గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద మిషన్లను పరిశీలించి తూకం కాటాలను చెక్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాలను తొలగించి రేషన్ షాపు డీలర్ల ద్వారానే ప్రజలకు రేషన్ బియ్యం అందించాలని తెలపడంతో అందుకు ఈపాస్ తూకం కాటాలను చెక్ చేసి డీలర్లకు అందించడం జరుగుతుందని తెలిపారు.

# మహానంది క్షేత్రంలో జబర్దస్త్ టీమ్



మహానందిలో పూజలు నిర్వహించి వస్తున్న జబర్ధస్త్ టీమ్ సభ్యులు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది క్షేత్రంలో బుల్లితెర నటులు జబర్ధస్త్ టీమ్ పూజలు నిర్వహించారు. గురువారం జబర్ధస్త్ నటులు వెంకి, ఆనంద్, వినోద్(వినోదిని)లతో పాటు మరికొందరు పూజలు నిర్వహించారు. గురువారం క్షేత్రానికి వచ్చిన వీరు ఆలయంలోని పుష్కరిణిలలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ టీవీలోని జబర్ధస్త్ ద్వారా మంచి గుర్తింపు లభించిందని అన్నారు.

సూర్య www.suryaa.com

శుక్రవారం | 30 మే 2025

# రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించండి



పెద్దకడుబూరు మేజర్ న్యూస్ : వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు సూచనలను ప్రతి రైతు తప్పనిసరిగా పాటించాలని పలువురు శాస్త్రి వేత్తలు అన్నారు. గురువారం పెద్దకడుబూరు మండల పరిధిలోని తారాపురం గ్రామంలో మండల వ్యవసాయాదికారి వర ప్రసాద్ అధ్యక్షుతన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ వరప్రసాద్ మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలోభాగంగా శాస్త్ర వేత్తలు బృందం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29 నుండి జూన్ 12 వ తేది వరకు రైతుల వద్దకు వెళ్లి వారికి ఖరీఫ్ పంటల సాగులో పాటించవలసిన సాగు పద్ధతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాలు, మట్టి పరీక్ష ఆధారంగా పంట ఎంపిక కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతులకు అవగాహన కల్పించనున్నారని అయన అన్నారు అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అనగా 29వ తేదీన కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి వారు తారాపురం పెద్దకడుబూరు గ్రామాలలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాట్లు. ఈ కార్యక్రమంలో కే.శ్రీలత (డి.పి.డిఆత్మా, కర్నూల్),డా.కె.అశోక్ కుమార్ సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు టి. చందన, పి. మౌనిక, తేజ, పెద్దకడుబూరు మండల వ్యవసాయ అధికారి యం. వర ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు యస్.జబీ ఉల్ల , యం శ్వేత, సి.ఇందు పాల్గొన్నారు.అదే విధంగా శాస్త్రవేత్తలు అధికారులు మాట్లాడుతూ మిరప, కంది, ప్రత్తిలో, చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులు గురించి వివరించారు , మండల వ్యవసాయ అధికారి యం.వర ప్రసాద్ ప్రభుత్వం అందించిన అందించబోయే పథకాలు గురించి తెలిపారు. డాక్టర్ . టి . శ్రీ చందన , శాస్త్రవేత్త (విస్తరణ విభాగం), కేవీకే గురించి కేవీకే అందిస్తున్న విస్తరణ సేవల గురించి తెలిపారు. ఎన్. తేజకుమార్ , కేవీకే బనవాసి, మట్టి నమూనాలు సేకరణ మరియు ప్రాముఖ్యత గురించి తెలిపారు.

# యాజమాన్య పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి

గోనెగండ్ల, మేజర్‌న్యూస్ : రైతులు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్నారు కావున యాజమాన్య పద్ధతుల ద్వార వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రైతులకు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని వ్యాపార కోణం చేసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి చేసి కోవాలని అలాగే సేంద్రియ ఎరువులు పెట్టి పెట్టుబడులు తగ్గించుకోవాలని కోరారు. పంటలకు ఎంతమోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకొని ఉండాలన్నారు. ఇష్టం వచ్చినట్లు రసాయన ఎరువులు వాడితే పంట దిగుబడి తగ్గి రైతుకు నష్టం వస్తుందన్నారు. ఖర్చులు అదుపులో పెట్టుకుంటే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. రైతులు మూస పద్ధతితో కాకుండా యాజమాన్య పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయాలని సూచించారు. పంటల్లో ఎదుర్కొనే సమస్యలు తీసుకోవలసిన సమస్యలపై రైతులకు అవగాహన అవసరం అన్నారు. సాయి హెల్త్ కార్డులు, సీసీఆర్సీ కార్డులు రైతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, డీఆర్సీ ఏడీఏ గిరీష్, డీఆర్ సీ ఏవో శశిధర్, బనవాసి కోఆర్డినేటర్ రాఘవేంద్ర, గోనెగండ్ల మేజర్ సర్పంచ్ హైమావతి, రైతులు పాల్గొన్నారు.

# సెకి ఒప్పందాలను రద్దు చేయాలి

- మహానాడులో హిందూ, ముస్లిం ఐక్యత ఊసే లేదు
- సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు

నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ : ఎన్నికల ముందు జగన్ చేసుకున్న సెకి ఒప్పందాన్ని రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు మాట మార్చారని, ఒప్పందాన్ని 20 ఏళ్ళ పాటు కొనసాగిస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు అన్నారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడులో హిందూ, ముస్లింల మత సామరస్యం గురించి గానీ, మత వైశమ్యాల గురించి మాట్లాడకపోవడం దురదృష్టకరమని అన్నారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే రాబోయే కాలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి మార్గం చూపడంలేదని అన్నారు. రూ. 1.20 పైసలకు ఇచ్చే విద్యుత్‌ను రూ. 4.60 లకు కొనాలని చెప్పడం చూస్తే ఆదానికి దోచి పెట్టడానికేనని ఆరోపించారు. నేటి పరిస్థితులు చూస్తే ప్రజలపైన విపరీతంగా విద్యుత్ బిల్లులు వేస్తున్నారని అన్నారు. రూ. 1.50 లక్షలు డిస్కంలపై అప్పులున్నాయని, ఇవి ఎవరి కోసం చేశారని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నరేంద్రమోడీని పొగడటానికే మహానాడును పెట్టుకున్నట్లు ఉందని, పాకిస్తాన్‌పై చేసిన యుద్ధంలో మనం సాధించింది ఏమీలేదన్నారు. పాకిస్తాన్ అభిమానులు దేశంలో ఉన్నారని ముస్లింలందరూ పాకిస్తాన్‌కు వెళ్ళాలని చెప్పడం రెండు వర్గాలను రెచ్చగొట్టడమేనని అన్నారు. గత నెలలో రాష్ట్రానికి వచ్చిన మోడీ రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని ఆరోపించారు. పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకోవడంలో ప్రధాని మోడీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్‌పై యావత్ దేశ ప్రజలు మద్దతు తెలిపితేమోడీ మాత్రం అమెరికాకు తలొగ్గాడని, యుద్ధంలో ఏమీ సాధించలేకపోయారని తీవ్రంగా విమర్శించారు. మన దేశ అంతరంగిక విషయాలలో ట్రంప్ జోక్యాన్ని నిలువరించడంలో మోడీ విఫలమయ్యారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి రమేష్‌కుమార్, ఏ నాగరాజు, టీ రామచంద్రుడు, పుల్ల నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌షాప్‌లను తహశీల్దార్ అకస్మీకంగా తనిఖీ



తుగ్గలి,మేజర్‌న్యూస్ : తుగ్గలి మండలం పరిధిలోని పగిడిరాయి, బొట తాండా, ఉప్పర్లపల్లి, జి ఎర్రగుడి గ్రామాలలో ఉన్న రేషన్ షాపులను మండల తహసిల్దార్ రమాదేవి గురువారంతనిఖీ చేశారు. జూన్ 1వ తేదీ నుండి ప్రజలు రేషన్ షాపుల ద్వారానే రేషన్ వేయించుకోవాలని, దానికి సంబంధించిన ఏర్పాట్లు ఆమె పరిశీలించారు. రేషన్ దారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డీలర్లు అన్ని ఏర్పాట్లు చేయాలని వారికి తెలియజేశారు. రేషన్ షాపులకు వచ్చే వినియోగదారులు నగదు తో పాటు ఫోన్ పే ద్వారా కానీ చెల్లించు వచ్చునున్నారు. రేషన్ సక్రమంగా అందించకపోతే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే ప్రకారమే రేషన్ వేయాలన్నారు అనంతరము రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్స్

చాగలమర్రి, మేజర్ న్యూస్ : యోగా సాధన తో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మాస్టర్ ట్రైనర్స్ పంచాయతీరాజ్ ఏఈ కొండారెడ్డి, తేజస్విని,విష్ణుప్రియలు తెలిపారు.చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయాల సిబ్బంది,మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ యోగాశనాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూప్రతిఒక్కరిజీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సీనియర్ సహాయకులు బాబు,జూనియర్ సహాయకులు బషీర్,ఎంసీక రాజ్‌కుమార్,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహానాడుకు తరలి వెళ్లిన కొలిమిగుండ్ల టీడీపీ నేతలు

కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః



తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూడవరోజు మహానాడు కార్యక్రమానికి కొలిమిగుండ్ల, గొర్విమానిపల్లె మరియు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి కొలిమిగుండ్ల టీడీపీ మండల అధ్యక్షులు మూలే రామేశ్వర రెడ్డి మరియు సోదరుడు మూలే హుసేన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

# పంచాయతీ కార్యదర్శికి ఆర్థిక సాయం



బనగానపల్లె,మేజర్‌న్యూస్ : నంద్యాల జిల్లా గోస్పాడు మండలం తేళ్లపురిలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సుజాతకు అనుకోని విధంగా బైక్ పై నుండి కింద పడి ఉదయానంద హాస్పిటల్‌లో ఐసియూలో ఉన్నారని, ఆమె చికిత్స నిమిత్తం బనగానపల్లె ఈవో మరియు బనగానపల్లె మండలం మొత్తం కార్యదర్శులు అందరూ కలిసి రూ.7200 లు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని బనగానపల్లె ఈవో తెలిపారు.పంచాయితీ కార్యదర్శులు అందరూ గ్రేడ్‌లతో సంబంధం లేకుండా సహకరించాలని ఆయన కోరారు.

# భోజన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి బిసి



టీడీపీ నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బిసి

బనగానపల్లె,మేజర్‌న్యూస్ : తెలుగుదేశం పార్టీ మహానాడు భారీ బహిరంగ సభ నేపథ్యంలో.. కడప నియోజకవర్గంలోని రాయచోటి రోడ్‌లో ,మైదకూరు రోడ్ లోని భోజన పాయింట్‌లో పార్టీ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన భోజన పాయింట్ లో జరుగుతున్న ఏర్పాట్లను సభకు వచ్చే అతిథులకు వడ్డించే ఆహార పదార్థాలు, వంటకాలను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గురువారం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మంత్రి బిసి మాట్లాడుతూ సభకు వచ్చే పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆహారం పంపిణీ విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలంటూ సూచనలు, సలహాలు చేశారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు

# సిద్ధం కండి- సిపిఐ

నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు సాధించేలా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీలలో సిపిఐ రెండవ పార్టీ అని అన్నారు. రానున్న రోజుల్లో శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి సుంకయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, పాల్గొన్నారు.

# "జూన్" నెల పెన్షన్లు మే 31 వ తేదీన పంపిణీ..ఎంపీడీవో. విశ్వమోహన్



తుగ్గలి ,మేజర్‌న్యూస్ : తుగ్గలి మండలంలో "జూన్" నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లును మే 31 వ తేదీ న పంపిణీ చెయ్యడం జరుగుతుందని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్, గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జూన్ 1వ తేది ఆదివారం కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జూన్ ఒకటో తారీఖున అందించవలసిన పెన్షన్లను ఒక్కరోజు ముందు అనగా మే 31 శనివారం ఉదయం 6 గంటల నుండి అన్ని రకాల పించన్లు, పెన్షన్ దారులకు ఇంటి వద్దనే వారి పరిధిలో ఉన్న గ్రామ సచివాలయము , ప్రభుత్వ సిబ్బంది వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.కావున పించన్లు దారులు పెన్షన్ సొమ్ము కొరకు గ్రామ సచివాలయాలకు వెళ్ళనవసరం లేదని మే 31 శనివారం పెన్షన్ దారులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని ఎంపీడీవో సూచించారు.

# నెలలు గడిచిన ఉపాధి కూలీలకు అందని వేతనాలు..

- వేతనాలు లేక ఇబ్బందుల్లో కూలీలు
- జాతీయ ఉపాధి హామీ పథకంలో..



**తుగ్గలి,మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గత మూడు నెలల నుండి వేతనాలు అందకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఉపాధి పనులు చేసి మూడు నెలలు కావస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మాత్రం ఇంతవరకు కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన ఫలితం లేకపోవడంతో ఇక సూదూర ప్రాంతాలకే వలసలు వెళ్లడం మంచిదని కూలీలు అంటున్నారు. ప్రభుత్వం మాత్రం ఒక పక్క కూలీలు వలసలు వెళ్ళకండి తమ గ్రామంలోని ఉపాధి పనులు చేసుకోండి అని ఒక ప్రక్క చెపుతున్నప్పటికీ వేతనాల మాత్రము నెలల తరబడి పనులు చేసిన వేతనాల మాత్రం అందటం లేదని కూలీలు వాపోతున్నారు. రోజు ఉపాధి పనులు చేసిన వేతనాలు పడకపోతే మా పరిస్థితి ఏమని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్పందించి పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేసి ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

# గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

**- మండల ప్రత్యేకధికారి రంగనాథ్ బాబు**



గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల అధికారులు.

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలో అసంపూర్తిగా నిర్మాణ దశలో ఆగిపోయిన గృహలను త్వరగతిన పూర్తి చేయాలనీ మండల ప్రత్యేకధికారి రంగనాథ్ బాబు అన్నారు. మండలంలో గురువారం బురాన్ దొడ్డి గ్రామంలో మండల అధికారులతో పర్యటించిన అయన లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు సాయం 50వేల రూపాయలు అందిస్తుందని అందుకు లబ్ధిదారులు త్వరగతిన నిర్మాణాలు మొదలు పెట్టి పూర్తి చెయాలనీ సూచించారు.లబ్ధిదారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణాలను ప్రారంభించాలని అందుకు సంబందిన బిల్లులు వెంట వెంటనే అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని అందుకు వెనువెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకధికారి రంగనాథ్ బాబు, ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, వర్క్ ఇన్స్పెక్టర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# మహానాడులో కోట్ల సుజాతమ్మను కలిసిన టిడిపి నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్‌:** తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు-2025 మూడవ రోజు గురువారం మహానాడు కార్యక్రమంలో భాగంగా డోన్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్‌నాయుడు, టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.



కోట్ల సుజాతమ్మతో శీలం భాస్కర్‌నాయుడు, టిడిపి నాయకులు

# డ్రస్ మేకింగ్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజర్స్ వారి సహకారంతో పంకజ్ ఫ్యాషన్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ సొసైటి వారి ఆధ్వర్యంలో డ్రస్ మేకింగ్‌లో 40 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాయలసీమ టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మక్బుల్ బాషా హాజరై మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మక్బుల్ బాషా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్వశక్తితో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీరజ, ఆనంద్, పావణి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 1న ఉద్యోగుల బదిలీలకు కౌన్సిలింగ్

**– జడ్‌పి సిఈఓ నాసరరెడ్డి**



జడ్‌పి సిఈఓ నాసరరెడ్డి

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం పరిధిలోని వివిధ కార్యాలయాల యందు పని చేయుచూ ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మరియు ఐదేళ్లు పూర్తి కాకున్నను బదిలీ కొరకు అభ్యర్థన దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్‌పి మినీ మీటింగ్ హాల్ నందు జూన్ 1న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జూనియర్ సహాయకులు, టైపిస్టులకు, మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు రికార్డు, లైబ్రరీ, ల్యాబ్ సహాయకులు, కార్యాలయ సబార్డినేట్, వాచ్‌మెన్లు, స్వీపర్లకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు సీనియర్ సహాయకులు, సాయంత్రం 5గంటల నుండి 6గంటల వరకు పరిపాలన అధికారులకు, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు మండల పరిషత్తు అభివృద్ధి అధికారులకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు చేయబడునని తెలిపారు. కావున సదరు ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని సిఈఓ కోరారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**– కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు హైమావతి**



హైమావతికి నియామక పత్రం అందచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు బి హైమావతి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఆదేశాల మేరకు గురువారం కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ బొగ్గుల హైమావతిని కర్నూలు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించారు. ఈ సందర్భంగా హైమావతికి మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష, అనంతరత్నం మాదిగలు నియామక పత్రం అందచేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనపై ఎంతో నమ్మకంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించినందుకు అధిష్టానం పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకొని కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎండ్లూరి లాజరస్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు లలితమ్మ, స్వప్న, సలోమి, మాణిక్యమ్మ, రాజేశ్వరి, మల్లిక, దివ్య పాల్గొన్నారు.

# బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం



నగదును అందచేస్తున్న దృశ్యం

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పెద్దపాడు రోడ్డులోని ఏపి ఆదర్శ పాఠశాల పక్కన నిర్మాణంలో ఉన్న శ్రీ బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణం నిమిత్తం కర్నూలు జిల్లా సి బెళగల్ మండలం పోలకల్ గ్రామ నివాసి సోమేశ్వర ఫర్టిలైజర్స్ యజమానికి కె పాండురంగడు రూ.25వేలు నగదును గురువారం విరాళం అందచేశారు. ఈ నగదును కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె రంగస్వామి, కోశాధికారి కెసి నాగన్న, జిల్లా ప్రచార కార్యదర్శి బిసి తిరుపాల్, కె ప్రేమ్ చంద్ సమక్షంలో అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకె రంగస్వామి మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ మరియు విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలను ఇవ్వాలని కోరారు.

# విద్యుత్ షాక్‌కు గురై రెండు బర్రెలు మృతి

- రూ1. 50 లక్షలు నష్టం... బోరున విలిపించిన బాధితుడు
- ఓ రైతు అక్రమ విద్యుత్ కనెక్షన్ వల్లే రెండు బర్రెలు మృతి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవాడీ గ్రామానికి చెందిన బోయ నరసింహులు అనే వ్యక్తికి సంబంధించిన రెండు బర్రెలు గురువారం విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాయి. వీటి విలువ సుమారుగా ఒకటిన్నర లక్ష రూపాయలు వరకు నష్ట పోయానని భాధితుడు తెలిపారు. భాధితుడు బోయ నరసింహులు , గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జాలవాడీ గ్రామానికి చెందిన గౌళ్ళ శరణప్ప అనే వ్యక్తి వంక రస్తా దగ్గర ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు త్రాగునీటి బోర్లుకు వేసుకొనే డ్యామేజ్ వైర్లును అక్రమంగా కనెక్షన్ తీసుకొని తన పంట పొలానికి నీటితడులు కట్టుకొనే వాడని వారు చెప్పారు. గురువారం బోయ నర్సింహులు తనకున్న రెండు బర్రెలను తోలుకొని గౌళ్ళ శరణప్ప పొలం గట్టు పై బర్రెలు మేతమేస్తుండగా అక్కడే పడి ఉన్న కరెంటు వైర్లును తాకడంతో బర్రెలు అక్కడకక్కడే మృతి చెందడం జరిగిందని తెలిపారు.గౌళ్ళ శరణప్ప అనే వ్యక్తి 2 సంవత్సరాలు నుండి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుండి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకొని తన పొలానికి నీటితడులు కట్టుకుంటున్న విద్యుత్ శాఖ అధికారులు మాత్రం స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గౌళ్ళ శరణప్ప ,విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తన రెండు బర్రెలు మృతి చెందాయని బాధితుడు బోయ నరసింహులు కన్నీరుమున్నీరయ్యాడు.దీంతో ఇంకా ఇలాంటి ప్రమాదాలు జరుగక ముందే విద్యుత్ అధికారులు కలగజేసుకొని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కు గౌళ్ళశరణప్ప అక్రమంగా వేసుకున్న కనెక్షన్ తొలగించాలని అలాగే బోయ నరసింహులుకు జరిగిన నష్టానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు,బాధితులు కోరుతున్నారు.